హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



నందనార్ నగర్ గణేష్ దేవాలయం వద్ద హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సహకారంతో డివిజన్‌లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని బీఆర్ఎస్ సీనియర్ నేత లింగాని శ్రీనివాస్ అన్నారు. తుకారాంగేట్‌లోని నందనార్ నగర్‌లోని గణేష్ దేవాలయం వద్ద స్థానికుల సౌకర్యార్థం మంగళవారం హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా డివిజన్లోని బస్తీలు, కాలనీల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఎల్లయ్య, నర్సింగ్, దేవయ్య, శంకర్, రామప్ప, ఇస్మాయిల్, కిట్టు, అమర్, శ్రీనివాస్, మహేందర్, నజీర్ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ బోర్డు మెంబర్‌గా కన్నాభిరాం



సీహెచ్ కన్నాభిరాం

అడ్డగుట్ట: బీఎస్ఎన్ఎల్ బోర్డు నామినేటెడ్ మెంబర్‌గా అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత సీహెచ్ కన్నాభిరాం నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం తుకారాంగేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పటిష్ఠతకు కష్టపడుతూ, ప్రజాసమస్యల పరిష్కారానికి అంకితభావంతో పని చేసే ప్రతీ ఒక్కరికి గుర్తింపు లభిస్తుందన్నారు. బీఎస్ఎన్ఎల్ నామినేటెడ్ మెంబర్‌గా నియమించినందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితోపాటు జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: డివిజన్‌ను సర్వతోముఖాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. ఎస్ఆర్‌టీ కాలనీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లైన్‌లో రూ.28 లక్షల వ్యయంతో చేపట్టనున్నసీసీ రోడ్డు పనులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే డివిజన్‌లో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో డీఈ సాయిసందీప్, ఏఈ జమీలి పాషా, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, రాజేష్ ముదిరాజ్, రాజు, షఫీ, సమీవుల్లా, జమీర్, రుక్మిణీరెడ్డి, లాలూ, శ్రీను, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు, వేల గొంతులు'కు అంబేడ్కర్ సంఘం మద్దతు



సమావేశంలో పాల్గొన్న అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు

లాలాపేట: ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న నిర్వహించ తలపెట్టిన 'లక్ష డప్పులు, వేల గొంతులు' భారీ సాంస్కృతిక ప్రదర్శనకు శాంతినగర్ అంబేడ్కర్ యువజన సంఘం మద్దతు తెలిపింది. మంగళవారం ఇక్కడ జరిగిన సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విధంగా వెంటనే రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు గోల్కొండ వెంకటేష్, నాయకులు సాయి, శ్యామ్‌సుందర్, బొట్టు సురేష్, మల్లేష్, మహేందర్, ముత్యాల గీతాదయాకర్, గాయత్రి, మణెమ్మ, కుమార్ షాను తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



టీజీపీసీబీ ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరించిన సీఎస్ శాంతికుమారి

సనత్‌నగర్: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీ–2025ను మంగళవారం చీఫ్ సెక్రటరీ శాంతికుమారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీవాత్సవ్, జనరల్ సెక్రటరీ కృపానంద్, సంయుక్త కార్యదర్శి సుమతి జగన్నాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వప్న, కల్చరల్ సెక్రటరీ అరుణ, జేసీఈఈ హనుమంతరెడ్డి, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ వినయ్‌కుమార్, ఈఈ వెంకట్‌నర్సు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదమా.. అదెక్కడ?



కేఎల్ఎన్‌వై మున్సిపల్ పార్కు

- కేఎల్ఎన్‌వై పార్కు నిర్వహణ గాలికి..
- ఒకప్పుడు 20 మంది సిబ్బంది.. ఇప్పుడు నిల్



పేరుకుపోయిన వ్యర్థాలు

అమీర్‌పేట: పార్క్ అంటే ఆహ్లాదం.. సందర్శకులకు ఆనందం.. కానీ, సనత్‌నగర్ కేఎల్ఎన్‌వై మున్సిపల్ పార్కులో అవి మచ్చుకు కూడా కానరావు. గేటుకు తాళం వేసే నాథుడు లేడు. తాళం తీస్తే వేసేవారే లేరు. ఎటు చూసినా అపరిశుభ్రతే. ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం.. ఒకప్పుడు 20 మంది సిబ్బంది ఉండేవారు. ఇప్పుడు ఒక్కరు కూడా దిక్కులేదు. ఆలనాపాలనా లేక అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. పార్క్‌లో ఆకతాయిలు తిష్ట వేసి సందర్శకులకు, వాకర్స్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నారు. నీటిసమస్య కారణంగా మరుగుదొడ్లు దుర్గంధభరితంగా మారాయి. నల్లాలను దొంగలు ఎత్తుకుపోవడంతో ట్యాంకులోని నీరు వృథాగా పోతోంది. ప్రతిరోజు పార్కులోకి 600 నుంచి 900 వందల వరకు సందర్శకులు, వాకర్స్ వస్తుంటారు. బయట పార్కింగ్ ప్రాంతంలో కుప్పలుతెప్పలుగా వ్యర్థాలు పేరుకుపోయాయి. నెలరోజులకు ఒకసారైనా ఊడ్చేవారు లేరు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పార్కులోని సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా కంటోన్మెంట్ తిరుమలగిరి, అడ్డగుట్ట, మారేడుపల్లి 11 కేవీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు (బుధవారం) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మురళికృష్ణ తెలిపారు. చిన్న కమేళా ఫీడర్ పరిధి తిరుమలగిరి సబ్‌స్టేషన్ పరిధిలోని లాల్‌బజార్, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, హోలీమేరి స్కూల్, లాల్‌బజార్ పోలీస్‌స్టేషన్, పోస్ట్ ఆఫీస్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, చిన్న కమేళా, అడ్డగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల, ముస్లిం గ్రేవ్‌యార్డ్, టీచర్స్ కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాస్త్రీనగర్ ఫీడర్ పరిధిలోని భూదేవినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న టీచర్స్ కాలనీ, గన్‌రాక్ విలేజి, జయభారతి, గన్‌రాక్ పంప్ హౌస్, శాస్త్రీనగర్‌తోపాటు మారేడుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని వాల్మీకి నగర్, గాంధీనగర్, గణేష్ నగర్, శోభన కాలనీ, సంజీవయ్య నగర్, వీకర్ సెక్షన్ టీబీటీ బ్లాక్, లేపాక్షి కాలనీల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కార్యాచరణ

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ మేకలమండి ప్రాంతంలో రూ.19.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ రీమోడలింగ్ పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ కె. హేమలతతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు వంటి సదుపాయాలను మెరుగుపర్చి దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. కార్యక్రమంలో డీఈ ఆంజనేయులు, జలమండలి డీజీఎం ఆశీష్, శానిటేషన్ డీఈ వెంకటేష్, గాంధీనగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి రవికాంత్, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్‌కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేషన్ రాజు, ఏసూరి మహేష్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరసన...

డ్రైనేజీ రీమోడలింగ్ పనులను ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు కాంగ్రెస్ నాయకులు నిరసన తెలియజేశారు. సొమ్ము ఒక్కరిది...సోకు మరొక్కరిది అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఎమ్మెల్యే సకాలంలో డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభించకపోవడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు చిరంజీవి ఆరోపించారు.

దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరిపై కేసు



చంద్రకిరణ్, మణికంఠ

అడ్డగుట్ట: దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం... మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన చంద్రకిరణ్(28) ఆటోడ్రైవర్. విష్ణుపురి కాలనీకి చెందిన మణికంఠ(23) అనే యువకుడు ఎలక్ట్రీషియన్. వీరిద్దరూ స్నేహితులు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోల్‌కు చెందిన రామకృష్ణ పని మీదపై హైదారాబాద్‌కు వచ్చి ఈ నెల 28న రాత్రి 1.30 గంటల సమయంలో ఊరికి వెళ్లేందుకు బస్ కోసం ఈసీఐఎల్ బస్టాండ్ వద్దకు వచ్చాడు. అదే సమయంలో చంద్రకిరణ్, మణికంఠ ఆటోలో వచ్చి ఎల్.బి నగర్‌లో దించుతామని చెప్పి రూ. 200 బేరం మాట్లాడుకున్నారు. మార్గమధ్యంలో లాలాపేట ఫ్లైఓవర్ వద్దకు చేరుకోగానే రామకృష్ణను బెదిరించి రూ.8,500, సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కున్నారు. అదే సమయంలో అక్కడ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న లాలాగూడ కానిస్టేబుళ్లు రాజశేఖర్, మహేష్‌లకు బాధితుడు ఫిర్యాదు చేశారు. దీంతో చంద్రకిరణ్, మణికంఠను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, మణికంఠపై ఇదివరకే పలు పోలీస్‌స్టేషన్లలో 6 దొంగతనాల కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలుండవ్

డ్రైవర్లకు ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అవగాహన



ఉత్తమ డ్రైవర్లతో ఏసీపీ శంకర్‌రాజు, ఆర్.ఎం. రాజశేఖర్ తదితరులు

బన్సీలాల్‌పేట్: ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు లేకుండా బస్సులను నడపాలని సికింద్రాబాద్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు సూచించారు. ఆర్టీసీ రాణిగంజ్ డిపో ఆవరణలో మంగళవారం సాయంత్రం జరిగిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సేఫ్ డ్రైవింగ్, సేఫ్ జర్నీ డ్రైవర్ల లక్ష్యంగా ఉండాలన్నారు. పెరుగుతున్న జనాభా, వాహనాల పెరుగుదల, ఇరుకైనా రోడ్లు ట్రాఫిక్ భద్రత, క్రమబద్ధీకరణ ట్రాఫిక్ పోలీసులకు సవాళ్లుగా మారాయని పేర్కొన్నారు. ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు ఎంతో కష్టపడి పనిచేస్తూ సంస్థ మనుగడకు పాటుపడుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. సికింద్రాబాద్ రీజియన్‌లో వరుసగా 33, 32 సంవత్సరాల పాటు ప్రమాదాలు జరగకుండా బస్సు నడిపిన మేడ్చల్ డిపో డ్రైవర్లు బి.వెంకటేశ్వర్లు, యు.కృష్ణ, హకీంపేట్ డిపోకు చెందిన ఆర్. శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్.ఎం కవిత, భీంరెడ్డి, భాస్కర్‌రెడ్డిలతోపాటు రాణిగంజ్ డిపో మేనేజర్ శ్రీధర్, డిపో మేనేజర్లు సుధాకర్, మహేష్, కవిత, ఆంజనేయులు, మురళీధర్‌రెడ్డి, హరి, వెంకటేశంలతోపాటు పెద్ద ఎత్తున డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాం కాలేజీ ప్రిన్సిపాల్ ఖాళీ సీటుకు ఏబీవీపీ వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అనుబంధ నిజాం కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ విద్యార్థులకు అందుబాటులో ఉండటం లేదని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. మంగళవారం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం అందచేయాలని వెళ్లిన ఏబీవీపీ నాయకులకు ప్రిన్సిపాల్ ఖాళీ సీటు కనిపించడంతో వినతిపత్రాన్ని కుర్చీకి అందచేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రొ.రాజశేఖర్‌ను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పృథ్వీతేజ, విక్రమ్, రామకృష్ణ, మోక్షిత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ సీటుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏబీవీపీ నేతలు

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్ల వంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 23, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 28, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 10–12, ముల్లంగి 4–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓయూలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ: పద్మ శ్రీ అవార్డుల ఎంపిక విషయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై ఓయూ విద్యార్థి నాయకులు మండిపడ్డారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. పీడిత వర్గాల ప్రజల విముక్తి కోసం, తెలంగాణ ఉద్యమంలో కాలికి గజ్జె కట్టి, గోసి, గొంగడి వేసుకొని గద్దర్ ప్రజలను చైతన్య పరచిన వేలాది కార్యక్రమాలను మరిచారా...? అని ప్రశ్నించారు. బీజేపీలో సంజయ్ కంటే పెద్ద నాయకులతో కలిసి గద్దర్ సభావేదికలు పంచుకున్నారని గుర్తు చేశారు. కులం, కుటుంబం కోసం కాకుండా పేదల అభ్యున్నతికి పోరాడిన గొప్ప వ్యక్తి గద్దర్ అని ఓయూ విద్యార్థి నేతలు కొనియాడారు. కార్యక్రమంలో శ్రీకాంత్, శ్రావణ్, నరసింహ, రఘు, దివాకర్, ప్రశాంత్, ప్రశాంత్, ఉదయ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఈఎస్ఐ ఉద్యోగుల నిరసన

పద్మారావునగర్: సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఈఎస్ఐ డైరెక్టరేట్ ఉద్యోగులు మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ ఆసుపత్రిని కార్పొరేషన్ చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా ఆసుపత్రిలో ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ యూనియన్ డీఐఎంఎస్ యూనిట్ అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ డైరెక్టరేట్ ఉద్యోగులకు తెలియకుండా రహస్యంగా ఈఎస్ఐని కార్పొరేషన్‌గా మార్చడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈఎస్ఐని కార్పొరేషన్ చేయాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనియెడల ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం

సనత్‌నగర్: ఎమ్మార్పీఎస్ బేగంపేట డివిజన్ నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. ఈ మేరకు మంగళవారం బేగంపేట నల్లపోచమ్మ దేవాలయం ఆవరణలో ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ్మారాజు సమక్షంలో సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా నరేందర్, సభ్యులుగా వెంకటేష్, సుదర్శన్, నర్సింగ్‌రావు, ఆనంద్, నారాయణ, శ్యాం, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

శ్రీనివాసన్‌కు గౌరవ డాక్టరేట్

లాలాపేట: ప్రముఖ ఎంటర్‌ప్రెన్యూర్ పి.ఆర్.శ్రీనివాసన్ ఇటీవల యునైటెడ్ థియాలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. 76వ గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని గుర్తించి యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేసింది. ఇందులో భాగంగానే ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, సృజనాత్మక రంగంలో విశేషంగా శ్రీనివాసన్ అందించిన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. విశ్రాంత జడ్జి మధుసూదన్‌రావు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. దీపక్ ఫ్రాన్సిస్ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.

అత్యున్నత ప్రమాణాలతో గ్రంథాలయాల ఏర్పాటు

ఎమ్మెల్యే శ్రీగణేష్



గ్రంథాలయ నిర్మాణ పనుల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో అత్యున్నత ప్రమాణాలతో గ్రంథాలయాలను నిర్మిస్తున్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. మంగళవారం తిరుమలగిరి, బొల్లారం పరిధిలో నిర్మిస్తున్న గ్రంథాలయాల నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ అంతస్తుల్లో నిర్మిస్తున్న ఈ గ్రంథాలయాల్లో ఒక అంతస్తులో పుస్తకాలు, లాప్‌టాప్‌లు వంటి ఆధునిక వసతులు, మరో అంతస్తులో పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఫ్యాకల్టీతో గైడెన్స్ ఇచ్చే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి పేద విద్యార్థి కాంపిటీటివ్ పరీక్షల్లో విజయం సాధించడానికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని, లక్షలాది రూపాయలను వసూలు చేసే బడా కోచింగ్ సెంటర్ల విద్యార్థులతో పోటీపడే విధంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ బుగ్గయ్య గౌడ్, ఏఈ ప్రసాద్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు వి.జయప్రకాష్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డి, స్థానిక నేతలు మురళి ముదిరాజ్ తదితరుల పాల్గొన్నారు.

మందకృష్ణ పద్మశ్రీని తిరస్కరించాలి

పిడమర్తి రవి



మాదిగ విద్యార్థి యువ గర్జన గోడపత్రికను ఆవిష్కరిస్తున్న పిడమర్తి రవి తదితరులు

రసూల్‌పురా: ఎమ్మెల్యే, ఎంపీ, ఇతర పదవులు కాలిగోటితో సమానమని చెప్పుకునే ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డును కూడా తిరస్కరించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. కంటోన్మెంట్ తిరుమలగిరి గాంధీ కమ్యూనిటీ హాలులో మాదిగ జేఏసీ కంటోన్మెంట్ ఇన్‌చార్జి వేణు ఆధ్వర్యంలో మంగళవారం మాదిగ విద్యార్థి యువగర్జన గోడపత్రికను రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణ మాదిగకు పదవులపై ఉన్న ప్రేమ ఎస్సీ వర్గీకరణపై లేదని, చిత్తశుద్ధి ఉంటే బీజేపీ ఇచ్చిన పద్మశ్రీ అవార్డును వెంటనే తిరస్కరించాలని అన్నారు. ఫిబ్రవరి రెండవ తేదీన ఓయూ ఆర్ట్స్ కాలేజీలో మాదిగ విద్యార్థి యువ గర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ మల్లేశం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నంద్రు నరసింహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ బొమ్మెర స్టాలిన్, శివ, మాదిగ జేఏసీ కంటోన్మెంట్ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ చైతన్య స్కూల్ వార్షికోత్సవాలు



స్కూల్ వార్షికోత్సవాల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

లాలాపేట: ఇన్‌క్రెడిబుల్ ఇండియా పేరుతో శ్రీ చైతన్య స్కూల్స్ వార్షికోత్సవాలను మంగళవారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జువైనల్ వెల్ఫేర్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ మైథిలీ భీమ్, అంతర్జాతీయ యోగా గురువు సంగీత అంకతే ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు భవిష్యత్‌లో వారి కాళ్లపై వారు నిలబడేలా నైపుణ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. నారాయణగూడ జోన్ ఏజీఎం నూర్ మహ్మద్ అలీ మాట్లాడుతూ విద్యార్థులను మరింత ప్రోత్సహించేలా స్మార్ట్ లివింగ్, ప్రోగ్రెసివ్ లెర్నింగ్ వంటి ప్రోగ్రాంలను నిర్వహిస్తున్నామన్నారు. స్కూల్ వార్షికోత్సవాలు విజయవంతం కావడంపై స్కూల్ డైరెక్టర్లు సీమ బోపన్న, నాగేందర్ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆటల్లోని విజేతలు, తరగతులవారీ టాపర్లకు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. వార్షికోత్సవాల్లో డ్యాన్స్‌లు, స్కిట్స్‌తో విద్యార్థులు అదరగొటారు. కార్యక్రమంలో రీజినల్ ఇన్‌చార్జి మల్లికార్జున్ నాయుడు, హైస్కూల్ కోఆర్డినేటర్స్ పుల్లారావు, రవి, రాజేంద్రప్రసాద్, సుధ, రుబీనా, స్కూల్ ప్రిన్సిపాల్స్ ప్రవీణ్ ప్రశాంతి, ధనలక్ష్మీ, భాగ్యలక్ష్మీ, జ్యోతి, దయాకర్, మౌనిక, అనంత్ రామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గద్దర్ జయంతి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 31న రవీంద్ర భారతిలో జరిగే ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఓయూలో మంగళవారం ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం, గద్దర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా విద్యార్థులు హాజరుకావాలని గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ కోరారు. కార్యక్రమంలో కోట శ్రీనివాస్‌గౌడ్, మందాల భాస్కర్, కంచర్ల బద్రి, సునీల్ శెట్టి, సంధ్య, శరత్‌నాయక్, వలిగొండ నరసింహ, అధ్యాపకులు సాగ నవీన్, కొండ నాగేశ్వర్, రవి, పరమేష్ పాల్గొన్నారు.

విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాడాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాడాలని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం తన నివాసంలో బీఆర్ఎస్‌వీ 2025 సంవత్సరం కేలండర్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కలసి ఆయన ఆవిష్కరించారు. నిరుద్యోగ భృతి, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఎలక్ట్రికల్ స్కూటీలు, హాస్టల్ సమస్యలు, గురుకులాల్లో నాసిరకం భోజనం, విద్యార్థుల మరణాలు వంటి విషయాలపై బీఆర్ఎస్‌వీ నాయకులు ఆందోళనలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వేల్పుకొండ వెంకటేష్, రామకృష్ణ, పరశురామ్, జంగయ్య, రమేష్, రత్నాకర్ రెడ్డి, విక్కీ, రాజశేఖర్, సందీప్, ఆదర్శ్, శ్రీఖర్, సుమంత్, కర్ణకర్, సాయి, ప్రదీప్, పవన్ తదితరులు పాల్గొన్నారు.